క్లుప్తంగా

ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తాం



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో ఆక్రమణల తొలగింపులో భాగంగా స్వమిత్వ సర్వేను సంత రోడ్డులో శనివారం ప్రారంభించారు. మొదటి దశగా సర్వే నిర్వహించి మార్కింగ్ వేస్తున్నట్లు ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్, డెప్యూటీ ఎంపీడీఓ ఏజేఎల్ నరసింహారావు తెలిపారు. అనంతరం ఆక్రమణలకు పాల్పడిన వారికి నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారు వాటిని వెంటనే తొలగించకపోతే పంచాయతీ ఆధ్వర్యంలో తొలగింపు చర్యలు ప్రారంభిస్తామని తెలిపారు. మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, ఎస్ఐ ఎస్.వి.వి.సత్యనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న భక్తులకు అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

115 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు



తోట్లవల్లూరు(పమిడిముక్కల): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ ఆఫ్ ఉయ్యూరు అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం సూచించారు. రోటరీ ఆధ్వర్యంలో మండలంలోని ఆమీనపురంలో శనివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో డాక్టర్ జగన్నాథరాజు, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ సరిత 115 మందికి ఉచిత దంత, కంటి, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. రోటరీ కార్యదర్శి అమీర్ మీర్జా, కేసీపీ మేనేజర్ రామచంద్రరావు, చింత వీర కోటేశ్వరరావు, డి. శివశంకర్రావు పాల్గొన్నారు.

పింగళి జన్మస్థలంలో ఘనంగా జయంతి వేడుకలు



భట్లపెనుమర్రు(మొవ్వ): మువ్వన్నెల జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జన్మస్థలమైన మొవ్వ మండలం భట్లపెనుమర్రులో శనివారం ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ కొండేటి ఇందిర, చందు దంపతులు, సర్పంచ్ మట్టా ఇందిర, సతీష్ దంపతులు గ్రామ ప్రధాన కూడలిలోని పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇచ్చి సముచిత గౌరవం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నందివాడ: మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ పెయ్యల ఆదాము, ఎంపీడీఓ మల్లేశ్వరి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గత సమావేశంలో సమస్యలను ఏఓ అధికారులను అడిగి.. ఎన్ని పరిష్కారమయ్యాయి అని తెలుసుకున్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ఈ మూడు నెలల కాలంలో వారి శాఖల పరంగా జరిగిన అభివృద్ధిని వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గాకుమారి, వైస్ ఎంపీపీ జయరాజు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీ కృష్ణ జనన బాల్య లీలలు

కైకలూరు: శ్రావణ శుద్ధ సప్తమి సందర్భంగా ఈ నెల 1 నుంచి 7 వరకు మీసాల వెంకన్న స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహం అందరినీ ఆకట్టుకుంది. టీటీడీ విశ్రాంత సమన్వయాధికారి మండలిక శ్రీ కృష్ణ కుమార శర్మ శనివారం ఉదయం చెప్పిన శ్రీకృష్ణ జననం, బాల్య లీలలు, సాయంత్రం ప్రహ్లాద చరిత్ర ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది.

రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్



తోట్లవల్లూరులో ఎరువుల కొరతపై నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించి, ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎరువుల కృత్రిమ కొరతను నిరసిస్తూ రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ఆయన తహసీల్దార్ ఎం. కుసుమకుమారికి శనివారం సాయంత్రం వినతి పత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా వరినాట్లు వేసిన రైతులు ఎరువుల కోసం పడుతున్న కష్టాలను అనిల్‌కుమార్ తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. అబద్ధపు హామీలు, మోసపు మాటలతో గద్దెనెక్కిన ప్రభుత్వం రైతులను కూడా వంచిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్‌లలో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు దొరక్కపోవడంతో బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనలేక సన్న, చిన్నకారు రైతులు అల్లాడిపోతున్నారన్నారు. ఎరువుల కోసం రైతులు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి, అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికన్నా మిన్నగా పాలిస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు, ఇచ్చిన మాట తప్పి నోరెత్తిన వారిని పోలీసు కేసులతో భయపెట్టాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమైన ఎరువులను పుష్కలంగా సరఫరా చేయాలని కోరారు.

అడ్డగోలుగా అవినీతి..

ఇసుక, మట్టి దందాలతో పామర్రు నియోజకవర్గం అవినీతికి కేంద్రంగా మారిందని కైలే అనిల్‌కుమార్ ఆరోపించారు. మండల పరిధిలోని ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్ల నుంచి వందల లారీలు ఇసుక ఎక్కడకు వెళుతోందని ప్రశ్నించారు. ఉచితం పేరుతో ఎమ్మెల్యే దగ్గర నుంచి కింది స్థాయి నాయకుడు వరకు అందిన కాడికి దండుకుంటున్నారని అనిల్‌కుమార్ విమర్శించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారిందని ఎద్దేవా చేశారు. ఇసుక అక్రమ రవాణ గురించి అడిగితే అధికారులు కనీసం సమాధానం చెప్పే పరిస్థితిలో కూడా లేకపోవటం దారుణమన్నారు. ఉచిత ఇసుక పేరుతో సాగుతున్న దోపిడీని అరికట్టాలని, స్టాకు యార్డుల వద్ద ధరల బోర్డులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు నడకుదురు రాజేంద్ర, మోర్ల రామచంద్రరావు, కిలారం శ్రీనివాసరావు, చింతలపూడి గవాస్కర్‌రాజు, చింతా రాజా, కిలారం రామకృష్ణ, తిరుమలశెట్టి వాసు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కుసుమకుమారికి వినతిపత్రం అందజేస్తున్న కైలే అనిల్‌కుమార్

హామీలు గాలికొదిలిన కూటమి ప్రభుత్వం



సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

మండవల్లి: ఎన్నికల హామీలను గాలికొదిలి, రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండవల్లిలోని భైరవపట్నం శుభం ఫంక్షన్ హాల్లో శనివారం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. డీఎన్నార్ మాట్లాడుతూ ఏడాదికే కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు చేబోయిన వీర్రాజు, రాష్ట్ర ఎస్సీ విభాగ కార్యదర్శి గుమ్మడి వెంకటేశ్వరరావు, బీసీ సెల్ విభాగ కార్యదర్శి బలే నాగరాజు, జిల్లా యాక్టివ్ సెక్రెటరీ థామస్, మండల పార్టీ అధ్యక్షుడు ఏశాపురాజు, జి వీరరాఘవయ్య, గుడివాడ మురళి, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, గోకర్ణయాదవ్, చిన్ని కృష్ణ, కె.మరియమ్మ, ఎ.దుర్గాదేవి, తేరా జ్ఞానవతి, బుంగా రాణి, బేబీ సరోజిని, సర్పంచ్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

గుడివాడ టౌన్: తల్లి పాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని ఏసీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమాలలో భాగంగా స్థానిక 30వ వార్డు దనియాలపేట అంగన్‌వాడి కేంద్రంలో శనివారం తల్లి పాల వారోత్సవాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు తల్లిపాలయొక్క ప్రాముఖ్యతను వివరించారు. పౌష్టికాహార లోపం జరుగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయంతి, కార్యకర్తలు ఎం. జగదీశ్వరి, జి. వెంకటేశ్వరమ్మ, వి. నిర్మల, బి. నవ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలల్లో పోషకాలు

గుడ్లవల్లేరు: చంటి బిడ్డలకు కావాల్సిన పోషకాలను తల్లి పాలతో అందించాలని కోరుతూ కూరాడలో శనివారం అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు ర్యాలీని చేపట్టారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ఈ ర్యాలీని ప్రధాన రహదారుల వెంబడి నిర్వహించారు. ఈ నెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు నిర్వహించే ఈ వారోత్సవాల్లో తల్లి పాల విశిష్టతను బిడ్డ తల్లులు, గర్భిణులకు తెలియజేస్తామని అంగన్‌వాడీలు పేర్కొన్నారు.

శిశువుల ఎదుగుదలకు తల్లి పాలు అవసరం

పెదమద్దాలి(మొవ్వ): శిశువు ఆరోగ్యానికి, ఎదుగుదలకు తల్లి పాలు అవసరమని ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పామర్రు ప్రాజెక్ట్ పరిధిలోని తోట్లవల్లూరు, పమిడిముక్కల, పెదపారుపూడి, పామర్రు మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రాజెక్ట్ లెవల్ కార్యక్రమాన్ని పెదమద్దాలి గ్రామంలోని కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సత్యశ్రీ, ఉషా, అనిత, అరుణ, సుజాత, నాగమల్లేశ్వరీ, సలీమున్నీసా, శివ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గుడివాడలో పౌష్టికాహార విలువలను తెలుపుతున్న పద్మావతి



గుడ్లవల్లేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు



పెదమద్దాలి ర్యాలీలో పాల్గొన్న సూపర్‌వైజర్లు, కార్యకర్తలు

'సముద్రం పాలవుతున్నా.. నీటిని వదలరా?'

కైకలూరు: ప్రసార మాధ్యమాల్లో వరద నీరు సముద్రం పాలవుతోందని చూపిస్తున్నారు.. మరో పక్క కైకలూరు నియోజకవర్గం శివారు గ్రామాలకు ఇప్పటికీ నీరు చేరడం లేదని పలువురు నీటి సంఘాల డీసీలు విజయవాడ కేఈ డివిజన్ ఈఈ బి.ఆంజనేయ ప్రసాద్‌ను ప్రశ్నించారు. కైకలూరు నియోజకవర్గానికి గుడ్లవల్లేరు లాకుల నుంచి పోల్‌రాజ్ కాల్వకు కేవలం 300 క్యూసెక్కుల నీరు విడుదల చేయడం వల్ల శివారుకు నీరు చేరడం లేదు. వాస్తవానికి పోల్‌రాజ్ కెపాసిటీ 630 క్యూసెక్కులు ఉన్నప్పటికీ తక్కువగా విడుదల చేస్తున్నారు. దీంతో డీసీలు, నీటి సంఘాల అధ్యక్షులు కృష్ణా జిల్లా ఇరిగేషన్ అధికారులను కలుస్తామని చెప్పడంతో, తానే వస్తానని శనివారం ఈఈ ప్రసాద్ విచ్చేశారు. కైకలూరు, గోపవరం, పెరికేగూడెం, ముదినేపల్లి ప్రాంతాల్లో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం కైకలూరు ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులు, డీసీలతో సమీక్ష నిర్వహించారు. గుడివాడ సమీప బల్లిపర్రు లాకుల నుంచి మూడే వేల క్యూసెక్కుల నీరు వస్తుందని, గుడ్లవల్లేరు వద్ద అది 1,500 క్యూసెక్కులకు చేరుతుందని ఈ విషయమైన ముగ్గురు ఇరిగేషన్ డీఈలతో చర్చించినట్లు తెలిపారు. మరో 10 రోజుల వ్యవధిలో పూర్తి స్థాయి నీటిని దిగువకు పంపించడానికి కృషి చేస్తానన్నారు. చేపల చెరువులకు కాకుండా తాగునీటి, వ్యవసాయ అవసరాలకు ముందు ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శిరీషా, డ్రెయినేజీ ఈఈ ఎం.రామకృష్ణ, ఆయా మండలాల డీసీలు వాసురాజు, పేటేటి సత్యనారాయణ, ముద్దం భోగేశ్వరరావు, సురేష్, నీటి సంఘాల నాయకులు పెద్దిరాజు, రాజేష్ పాల్గొన్నారు.



గోపవరం గ్రామంలో నీటి విడుదలపై గుడివాడ ప్రాంత డీఈలతో మాట్లాడుతున్న ఈఈ ఆంజనేయప్రసాద్

ఘనంగా గంగానమ్మ ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజలో నూతనంగా నిర్మించిన గంగానమ్మ ఆలయ, విగ్రహ పునః ప్రతిష్టా మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఆలయాన్ని గ్రామస్తులు, భక్తుల విరాళాలతో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించారు. ఆముదాలపల్లికి చెందిన సోమరాజుపల్లి ఈశ్వర నాగ కుమారశర్మ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలిరోజు శనివారం గోపూజ, హోమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా 3న క్షీరాధి, ధాన్యాధివాసాల వంటి విశేషపూజలు జరిపి 4న సోమవారం యంత్రస్థాపన, ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకాలు, అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు పెయ్యేరు పంచాయతీపై విచారణ

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెయ్యేరు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఈ నెల 4న ఏలూరు ఇన్‌చార్జి డీఎల్పీఓ లక్ష్మీ విచారణ నిర్వహిస్తారు. ఈ పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి సంబంధించి గతంలో విచారణ జరిగింది. దీని నివేదిక ఆధారంగా సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేస్తూ డీపీఓ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అయితే మరికొందరు గ్రామస్తులు చేసిన ఆరోపణలపై 4వ తేదీన విచారణ జరగనుంది. పంచాయతీలో 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 వరకు రూ.37.59 లక్షలు నిధులు దుర్వినియోగం జరిగినట్లు తొలుత నిర్వహించిన విచారణలో తేలింది. ఈ నిధుల దుర్వినియోగంలో పంచాయతీ కార్యదర్శితో పాటు సర్పంచ్‌ను సైతం బాధ్యులుగా చేశారు. అదేవిధంగా పంచాయతీ పరిధిలో 260 నీటికుళాయి కనెక్షన్‌లకు రూ.4.68 లక్షలు వసూలు చేయకుండా నష్టం కలిగించినట్లు విచారణలో తేలిందని డీపీఓ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

348 మందికి ఉచిత వైద్యం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో 348 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, దంత సమస్యలకు ఏలూరు సెయింట్ జోసఫ్ డెంటల్ వైద్యులు, గుండె సంబంధ వ్యాధులకు విజయవాడ సీవీఆర్ మల్టీ స్పెషాల్టీ హాస్పటల్ వైద్యులు తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆదివారం విజయవాడ కామినేని హాస్పిటల్, విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, గుడివాడ హోమియో డాక్టర్ భవాని, హైదరాబాదు మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ హరిహర్ వైద్య పరీక్షలు చేయనున్నట్లు డాక్టర్ వెంకట్రావు తెలిపారు.

చెరువులకు నీటిని మళ్లిస్తే చర్యలు

ముదినేపల్లి రూరల్: పోలరాజ్ పంటకాలువ నుంచి ఆక్వా చెరువులకు నీటిని మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముదినేపల్లి సెక్షన్ నీటిపారుదల శాఖ ఏఈ కేవీ సత్యనారాయణ అన్నారు. పోలరాజ్ కాలువను ఏఈ శనివారం పరిశీలించారు. ఈ కాలువలో గుడ్లవల్లేరు నుంచి లింగాల వరకు 10 కిలోమీటర్లు పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించేందుకు రూ.4 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. శివారు భూములకు సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండలంలోని చిగురుకోట, చిన్నకామనపూడి గ్రామాల్లోని శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

యూరియా అందించకపోతే ఎలా?

మోపర్రులో రైతుల ఆందోళన

మోపర్రు(పెదపారుపూడి): ఖరీఫ్ సీజన్ వరి పంటకు అవసరమైన యూరియా, డీఏపీని సకాలంలో వ్యవసాయాధికారు అందించకపోతే ఎలా అంటూ రైతులు ప్రశ్నించారు. మండలంలోని మోపర్రులో శనివారం ఎరువులు సకాలంలో అందించాలని శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జూపల్లి శేఖర్, రైతు హనుమంతు మాట్లాడుతూ వెంట్రప్రగడ సొసైటీ కేంద్రానికి వెళ్లి యూరియా, డీఏపీ కావాలని అడిగితే నో స్టాక్ అని చెబుతున్నారన్నారు. మోపర్రు గ్రామానికి చెందిన రైతులకు యూరియా, డీఏపీకి సంబంధించి ఒక్క బస్తాకూడా ఇవ్వలేదన్నారు. చేసేది లేక గుడివాడలోని పోస్టాఫీసురోడ్డులోని ఎరువుల దుకాణాలకు వెళ్లి అడిగితే జింక్ తీసుకుంటేనే యూరియా, డీఏపీ ఇస్తామని చెబుతున్నారన్నారు. ప్రస్తుతం ఉపయోగం లేని జింక్‌ను తీసుకెళ్లాలంటే అధిక భారం తప్ప ఏమీ లేదన్నారు. జిల్లా అధికారి దగ్గరకు వెళ్లి ఎరువుల సమస్యను చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు.

సూపర్‌వైజర్ పుణ్యవతికి ఉద్యోగోన్నతి

మొవ్వ: మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో సెక్టార్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏనుగు పుణ్యవతికి సీడీపీఓగా ఉద్యోగోన్నతి లభించింది. ఆమెను శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రూ అప్ పేరుతో ప్రజలపై విద్యుత్ భారం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు డీఎన్‌వీడీ ప్రసాద్

కలిదిండి(కైకలూరు): విద్యుత్ చార్జీలు పెంచడం లేదంటూనే ట్రూ అప్ పేరుతో మరో రూ.12,771 కోట్ల భారాన్ని ప్రజలపై మోపడాన్ని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డీఎన్‌వీడీ. ప్రసాద్, కె.శ్రీనివాస్ తీవ్రంగా వ్యతిరేకించారు. కలిదిండిలో సీపీఎం ప్రాంతీయ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ 2019-20 నుంచి 2023-24 సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ రిటైల్ వ్యాపార లోటు రూ.12,771 కోట్లు ట్రూ అప్ భారం వేయడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపి బహిరంగ ప్రకటన చేశాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి తెలియకుండా ఇది జరగదని, ప్రభుత్వం వెంటనే స్పందించి చార్జీల పెంపుదలను నిలిపేయాలని కోరారు. అదేవిధంగా 2014-19 కాలానికి సంబంధించి రూ.3 వేల కోట్లు ట్రూ అప్ వసూలు చేశారని పేర్కొన్నారు.

కూటమి వచ్చాక రూ.15,485 కోట్ల భారం

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 2022-23, 2023-24 సంవత్సర కాలానికి రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీల భారం మోపారని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. అదీగాక 2024-25 సంవత్సరానికి ప్రతి నెలా యూనిట్‌కు 40 పైసలు చొప్పున ఒక్క సంవత్సరం లోనే రూ.2,787 కోట్లు వసూలు చేశారని తెలిపారు. విద్యుత్ భారాలు వేయబోమని, తగ్గిస్తామని కూటమి పార్టీ నాయకు లు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఇటీవల రూ.449 కోట్లు ట్రూడౌన్‌ద్వారా చార్జీలు తగ్గిస్తామని ప్రచారం చేశారని, మూడు డిస్కంల పరిధిలో సగటున మిగులు ఉందని కూడా చూపెట్టారన్నారు. ఈ తరుణంలో మరో రూ.12,771 కోట్లు భారం మోపుతూ పంపిణీ సంస్థలు, విద్యుత్ నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపగా, మండలి వాటిపై అభిప్రాయాలు తెలపాలని జూలై 30న నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. నిర్ణయించిన విద్యుత్ చార్జీలు చెల్లించిన ఐదు సంవత్సరాల తరువాత ఆదాయ, వ్యయాల మధ్య లోటు పేరుతో ట్రూఅప్ చార్జీలు వసూలు చేసే విధానమే అక్రమమని విమర్శించారు. ఈ విధానాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వం, పంపిణీ సంస్థలు కార్పొరేట్ కంపెనీలతో అక్రమ ఒప్పందాలు, అవినీతి చర్య ల తో అడ్డగోలుగా వ్యయాన్ని పెంచి ఆ భారాన్ని వినియోగదారులపై వేయడం దారుణమన్నారు. వి ద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ట్రూ అప్ ఇంధన సర్దుబాటు చార్జీల విధానం రద్దు చేయా లని, స్మార్ట్ మీటర్లు వద్దని ఈ నెల 5న ప్రజావేదిక ఆధ్వర్యంలో జరిగే ధర్నాలను జయప్రదం చేయా లని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్ర మంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు జక్కుల మహేష్, కార్యదర్శి ఎస్. మహంకాళిరావు ప్రాంతీయ కమిటీ సభ్యులు చిన్నం మాధవ పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో ఇతరుల ప్రవేశ నిషేధం జీఓను రద్దు చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుడివాడ టౌన్: విద్యా సంస్థల్లో ఇతరుల ప్రవేశ నిషేధం జీఓను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్. సమరం విలేకరులతో మాట్లాడారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నూతనంగా విడుదల చేసిన జీఓ విద్యార్థుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందన్నారు. విద్యా సంస్థల్లోకి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మినహా ఏ ఒక్కరి ప్రవేశం నిషేధం అంటూ జీఓలో పేర్కొనడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. ఇది విద్యా సంస్థల నిరంకుశత్వాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. అక్కడ జరిగే అరాచకాలు విద్యార్థులపై సంస్థలు పెట్టే ఒత్తిడి వంటివి బయటపడకుండా కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు కలిగేలా ఈ జీఓ ఉపయోగపడుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా ప్రస్తుత విద్యాశాఖ మంత్రి విద్యార్థుల సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేయడం, సమస్యలు అడిగి తెలుసుకుని అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేవారన్నారు. ప్రస్తుతం ఆ విధానాలను రద్దు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ పూర్తిగా ఖండిస్తుందని తెలిపారు. ఇందుకు నిరసనగా ఆదివారం జీఓను దగ్ధం చేసే కార్యక్రమం చేపడతామన్నారు. అప్పటికీ ప్రభుత్వం విధానాన్ని మార్చుకోకపోతే విద్యార్థి సంఘాలను ఐక్యం చేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాల పంపిణీ



పోటీ పరీక్షల పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

కైకలూరు: ఉద్యోగాన్వేషణలో విద్యార్థులకు ఉపయోగపడే పోటీ పరీక్షల పుస్తకాలను వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు అవనిగడ్డకు చెందిన అంజనా ఫౌండేషన్ సంస్థ తరఫున శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ బి.నవీన్, సీఈవో ప్రొఫెసర్ వి.శ్రీనివాసరావు డిగ్రీ విద్యార్థులకు పోటీ పరీక్షల తీరును వివరించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు పోటీ పరీక్షల పుస్తకాల సెట్‌లను బహుమతులుగా అందించారు. దాతలను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అడపా కేదారి, అధ్యాపకులు రవికుమార్, జాలాబాబు, పాల్ దివాకర్ పాల్గొన్నారు.

నిలిచిన ఆక్రమణల తొలగింపు సర్వే

ముదినేపల్లి రూరల్: చిన్నకామనపూడి పంచాయతీకి చెందిన ఊరచెరువులో ఆక్రమణలు తొలగించేందుకు శనివారం చేపట్టిన సర్వే నిలిచిపోయింది. దీంతో అధికారులు వెనుదిరుగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పంచాయతీకి ఆర్ఎస్‌నెం. 34/1లో 2.35 ఎకరాల్లో ఊర చెరువున్నట్లు సర్పంచ్ చిట్టూరి నంచారాయ్య తెలిపారు. ఈ చెరువు పక్కనే ఆర్ఎస్‌నెం. 34/2లో 0.62 సెంట్లు ఉన్న పోరంబోకు భూమిని, అలాగే ఊరచెరువులోని మరో 0.40 సెంట్లు ఆక్రమించి కొందరు చేపలచెరువు తవ్వి సాగు చేసుకుంటున్నట్లు చెప్పారు. చెరువును సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని అధికారులకు విన్నవించగా శనివారం సర్వే చేసేందుకు మండల సర్వేయర్ రాజశేఖరరెడ్డి, ఆర్ఐ గ్రామానికి చేరుకున్నారని పేర్కొన్నారు. అయితే ఆక్రమణదారులు అడ్డుకుని సర్వే జరగకుండా నిలిపివేసినట్లు తెలిపారు. దీనిపై మరోసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్ చెప్పారు.

అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభం

పామర్రు(మొవ్వ): పామర్రులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద శనివారం అన్నదాత సుఖీభవ పథకాన్ని అధికారులు, రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో మొదటి విడతగా రూ.7వేలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటి వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, కుదరవల్లి ప్రవీణ్, జన్ను శోభన్‌బాబు చంద్ర, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీ దాసు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో గుడివాడ నియోజకవర్గ పరిధిలోని రైతులకు శనివారం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాన్ని రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం రైతులకు చెక్కులను అందజేశారు. ఏఓ ఎల్.సునీల్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి కుమార్, పాలేటి ఆంజనేయులు పాల్గొన్నారు.



పామర్రులో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా